క్లుప్తంగా

శ్రీరంగనాథరాజును కలిసిన సివిల్స్ ర్యాంకర్



శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిసిన సివిల్ ర్యాంకర్ చిట్టిరాజు

పెనుగొండ: 2024 సంవత్సర సివిల్స్ ఫలితాల్లో 833 ర్యాంకు సాధించిన శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు తనయుడు చిట్టిరాజు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం తూర్పుపాలెంలో కార్యాలయంలో కలిసి శ్రీరంగనాథరాజు ఆశీస్సులు పొందారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం నాల్గవ రోజు పట్టణంలోని దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. విద్యార్థులకు అగ్నిమాపక ప్రమాదాలపై డెమో ద్వారా వివరించారు. పెద్ద పెద్ద భవనాలు, మాల్స్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ద్వారా ప్రమాదం సంభవించినా లేదా ఎల్‌పీజీ వంట గ్యాస్ వాడుతున్నప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఏ విధంగా నిర్మూలించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వై.వి జానకిరామ్, కళాశాల ప్రిన్సిపాల్ శోభరాణి, వైస్ ప్రిన్సిపాల్ సి రవి శంకర్, ఫిజికల్ డైరెక్టర్ ఎల్ రమేష్, జెఎస్‌జి రాజ్, అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

నరసాపురం: వంట గ్యాస్ లీకై ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని నరసాపురం ఫైర్ ఆఫీసర్ కె.భాస్కరరామ్ సూచించారు. అగ్రిపమాక వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఫైర్ అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్స్‌లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా వంటి గ్యాస్ సిలండర్ల వాడకం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళలకు వివరించారు. వంట గ్యాస్ సిలిండర్లు ద్వారా గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై డెమో నిర్వహించారు. ముఖ్యంగా వేసవి కాలంలో అగ్నిప్రమాదాల విషయంలో అతి జాగ్రత్తగా ఉండాలని భాస్కరరామ్ సూచించారు.

ఘనంగా క్షీరారామలింగేశ్వరస్వామి కల్యాణం



క్షీరారామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి శ్రీ పార్వతి సమేత శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీసమేత జనార్ధనస్వామివార్ల కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కల్యాణోత్సవాలు 23వ తేది వరకూ నిర్వహించనున్నారు. 18వ తేది గురువారం రాత్రి 5.05 గంటలకు (తెల్లవారితే శుక్రవారం) స్వామివార్ల కల్యాణం నిర్వహించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3గంటల నుంచి స్వామివారి రథోత్సవం, శనివారం, ఆదివారం, సోమవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, మంగళవారం ఉదయం త్రిశూల స్నానము, చక్రస్నానము, రాత్రి పుష్పోత్సవం, కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపే లక్ష్యం

భీమవరం: ఇంజినీరింగ్ విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే భావవ్యక్తీకరణ, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపర్చుకోడానికి ఇన్ఫినిటో అనే సాంకేతిక, సాంస్కృతిక వేడుకలు నిర్వహిస్తున్నట్టు భీమవరం డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) తెలిపారు. కళాశాలలో బుధవారం బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ ఆధ్వర్యంలో ఫస్ట్ ఇయర్ బీటెక్, పాలిటెక్నిక్ విద్యార్థులకు నిర్వహించిన ఇన్ఫినిటో ఫెస్ట్ ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. డీఎన్నార్ కళాశాల విద్యార్థులతో పాటు వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఫెస్ట్ ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు.

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం



పాలకొల్లు అర్బన్: తిల్లపూడిలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపీ)



పాలకొల్లు అర్బన్: భక్తులకు ప్రసాదాలు వడ్డిస్తున్న టీటీడీ పాలకమండలి సభ్యుడు మేకా శేషుబాబు



మొగల్తూరు: వేంకటేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



నరసాపురం రూరల్: కొప్పర్రు రామాలయంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మొగల్తూరు: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మండలంలో సీతారాముల కల్యాణాన్ని బుధవారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి రామాలయాల వద్ద భక్తులు కిటకిటలాడారు. రామనామ జపంతో రామాలయాలు మార్మోగాయి. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. పలు ఆలయాల వద్ద సీతారాముల కల్యాణాన్ని జరిపించి భక్తులకు పానకాలు పోశారు. మొగల్తూరులోని పురాతన రామాలయంలో ఆలయ అర్చకులు సుదర్శనం లక్ష్మీ నరసింహాచార్యులు, రామశేషు, రామ్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో కొత్తగుండు వెంకట గుప్త, సంధ్యారాణి దంపతులచే కల్యాణం జరిపించారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో కురెళ్ళ రామచంద్రుడు, గంగా పవన్ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవం జరిపించారు. మొగల్తూరు పంచాయతీ సత్రవుపాలెం రామాలయంలోను, పేటపల్లంలోని రామాలయంలోను, స్థానిక బట్టల వర్తక సంఘం ఆధ్వర్యంలో రాములోరి కల్యాణం ఘనంగా నిర్వహించి, అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

వాడవాడలా సీతారాముల కల్యాణం

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలో ఊరూరా, వాడవాడలా.. సీతారాముల పెళ్లి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొప్పర్రు, సీతారామపురం, వేములదీవి, పసలదీవి, లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్లు, దర్భరేవు, కే బేతపూడి తదితర గ్రామాల్లోని రామాలయాల్లోని వేద మంత్రాల నడుమ రాములోరి వివాహ వేడుకలు వైభవంగా నిర్వహించారు. తూర్పుతాళ్లు గ్రామంలో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు రూ.10వేలు విలువైన వెండీ కిరీటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల వెంకట కిషోర్, లక్ష్మీనరజ, కోట్ల సుధాకర్, కంచర్ల సోని, వంకాయల వెంకట రవికుమార్, కంచర్ల సోని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

పాలకొల్లు సెంట్రల్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా పట్టణంలోని వివిధ కూడళ్లలో ఉన్న రామాలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ భక్తులు సీతారాముల కల్యాణోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణ ఉత్సవం ముగిసిన అనంతరం భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదం అందజేశారు. స్థానిక మారుతి సెంటర్ రామాలయంలో, బుధవారపు వీధి రామాలయంలో, యడ్లబజారు సెంటర్ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో, ముచ్చర్లవారి వీధి, మన్యం జగ్గమ్మ సత్రం, మెయిన్‌రోడ్డు శ్రీ క్షీరారామ సువర్ణ వర్తక సంఘం ఆధ్వర్యంలో, పినిశెట్టి వారి వీధి, బ్రాడీపేట శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో, వెలమ గూడెం, రంగమన్నారుపేట సెంటర్, కెనాల్ రోడ్డు దాసోహంజనేయస్వామి, లజపతిరాయ్‌పేట, హౌసింగ్‌బోర్డు కాలని, రైల్వేగేటు సెంటర్, గజలక్ష్మి సెంటర్, బార్గవినగర్, వడలివాని పేట, డాంపేట, రామాలయాల్లో స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గాదె వెంకన్న, శీరం ఆనందకృష్ణ, మల్లవోలుసురేష్, చెరుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోడూరు: మండలంలోని పెనుమదం తూర్పువీధిలోని శ్రీపట్టాభి రామాలయంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు అల్లు మురళి, పద్మావతి దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణం జరిపించారు. భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. కల్యాణం, పూజా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పితాని చిన్నా, పాలకొల్లు ఏఎంసీ వైస్ చైర్మన్ డీటీడీసీ బాబు, పెనుమదం సొసైటీ చైర్మన్ కొత్రపాటి వీరాస్వామి, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బొద్దు బాబి, గ్రామకమిటీ అధ్యక్షుడు గెద్దాడ ఏసు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పోడూరు, పండిత విల్లూరు, కవిటం, కొమ్ముచిక్కాల, జిన్నూరు, వేడంగి తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

యలమంచిలి: మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేడపాడు ముద్దల వారి వీధిలో మేడిచర్ల వారి ఇంటి వద్ద ఉన్న రామాలయంలో సీతారాముల కల్యాణం బుధవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ కొనసీమ జిల్లా గుడిమెళ్లంక గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ కడియాల సుబ్రహ్మణ్యశర్మ, ప్రతిష్ఠాచార్య మానేపల్లి సత్యనారాయణ శర్మ బ్రహ్మత్వంలో ఐదు రోజులపాటు శ్రీ సీతారామ పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

పెనుగొండ: మండలంలో శ్రీరామ నవమి వేడుకలు బుధవారం వాడవాడలా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెనుగొండలో కంబాల వారి వీధి, రామచంద్రరావు పేట, జవ్వాదివారి వీధి, బజారు రామాలయం, లింగాల వీధి, బీళ్ల వారి రామాలయం, కొప్పిశెట్టివారి వీధి, చెరుకువాడ, కూరగాయల వర్తకుల సంఘం ఆధ్వర్యంలో సంతమార్కెట్‌లోనూ, వడలి కమ్మవారి రామాలయం వద్ద, సిద్ధాంతం, ములపర్రు, ఇలపర్రు, చిన మల్లం, దేవ, నడిపూడి, మునమర్రు, కొఠాలపర్రుల్లోనూ నిర్వహించారు. కల్యాణం అనంతరం భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. వడలి కమ్మవారి రామాలయంలో కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అన్న సమారాధన అనంతరం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

పాలకొల్లు అర్బన్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని శ్రీరామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని తిల్లపూడిలో జిల్లా అటవీశాఖ అధికారి నడపన రామచంద్రరావు - సుష్మిత దంపతులచే సీతారాముల కల్యాణం కన్నుల పండువగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల పాల్గొని సీతారాముల కల్యాణం తిలకించి ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, గ్రామ సర్పంచ్ నడపన శ్రీనివాసరావు, సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు నడపన చిన సత్యనారాయణ, నడపన రమేష్‌నాయుడు, నడపన ఆదినారాయణ తదితరులు పాల్గొని భక్తులకు సేవలందించారు. పాలకొల్లు గజలక్ష్మి థియేటర్ వద్ద నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నసమారాధనలో టీటీడీ పాలక మండలి సభ్యులు మేకా శేషుబాబు పాల్గొని భక్తులకు ప్రసాదాలు అందజేశారు. గుత్తుల వారితోటలో నిర్వహించిన అన్న సమారాధనను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జోగి వెంకటేశ్వర రావు, అడబాల గార్డెన్స్ అధినేత అడబాల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామచంద్రస్వామి కల్యాణ ఉత్సవాలు

పెనుమంత్ర: మండలంలో వివిధ గ్రామాల్లో బుధవారం శ్రీరామనవమిని ఉత్సవాలు వైభవంగా జరిగాయి. 188 ఏళ్ల చరిత్రగల్గిన నెగ్గిపూడి గ్రామంలో సీతారామచంద్రస్వామి కల్యాణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇక్కడ దంపతులు సామూహికంగా పూజలు నిర్వహించి కల్యాణ ఉత్సవాలను అత్యంత వైభవంగా జరిపారు. సొసైటీ అధ్యక్షుడు అల్లం భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు జరిగాయి. మార్టేరులోని శివరావుపేటలో వేంచేసియున్న భద్రాద్రి రామస్వామి కల్యాణోత్సవాలు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వెలగల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. పెనుమంత్రలో ఊసల రామాలయంలో తమనంపూడి శివసాయి సోమిరెడ్డి, ఊహ దంపతుల ఆధ్వర్యంలో కల్యాణ ఉత్సవాలు నిర్వహించారు. వెలగలవారిపాలెం గ్రామంలో శ్రీరామచంద్ర స్వామివారికి కర్రి ధర్మారెడ్డి లక్ష్మి దంపతులు కల్యాణ ఉత్సవాలు నిర్వహించారు. ఆలమూరులోని శ్రీసీతా రామచంద్రస్వామివారి ఆలయంలో ఆలయ ఈవో పీటీ గోవిందరావు ఆధ్వర్యంలో భక్తులు కల్యాణ ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా నెగ్గిపూడి, వెలగలవారిపాలెం, పెనుమంత్ర గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.



నెగ్గిపూడిలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: మారుతి సెంటర్ రామాలయం వద్ద సీతారాముల కళ్యాణంలో నూతన దంపతులు



పోడూరు: పెనుమదంలో పట్టాభిరామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



యలమంచిలి: మేడపాడులో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



పెనుగొండలో సీతారాముల కల్యాణం

నేడు 20వ వార్డులో గుడాల గోపి ఎన్నికల ప్రచారం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 20వ వార్డు 9వ సచివాలయం నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) గురువారం మధ్యాహ్నం 2గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొని గుడాల గోపికి మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

పాలకోడేరు: ప్రతి అంశంలో తన సొంత ప్రయోజనాలు చూసుకునే ఈ రోజుల్లో ప్రధాన రహదారిపై ప్రయాణించే ప్రజలకు మజ్జిగతో దాహం తీర్చడం అభినందనీయమని పాలకోడేరు తహసీల్దార్ కె నాగార్జున అన్నారు. పెన్నాడలో చలివేంద్రాన్ని తహసీల్దార్ నాగార్జున ప్రారంభించారు.

నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం



నామినేషన్లు వేయనున్న మున్సిపల్ కార్యాలయం

పాలకొల్లు సెంట్రల్: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈనెల 18నుంచి ప్రారంభం కానుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.ఎస్ నారాయణరెడ్డి తెలిపారు. ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి నామినేషన్లు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. 25 వరకు నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు అవకాశం ఉందన్నారు. 26న నామినేషన్లు స్క్రూటినీ చేసి నామినేషన్లు ఉపసంహరణకు 29 వరకు గడువు ఇచ్చినట్లు చెప్పారు. అయితే నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే అనుమతి ఇస్తామన్నారు. 100 మీటర్లు దూరం వరకు మాత్రమే ర్యాలీలు, ప్రదర్శనలకు అనుమతి ఉంటుందన్నారు. నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి కల్పిస్తామన్నారు. జూన్ 6న ఓట్లు లెక్కింపు ఉంటుందని చెప్పారు. జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని నారాయణరెడ్డి వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికల నామినేషన్లు ఎప్పుడూ తహసీల్దార్ కార్యాలయంలోనే వేయడం జరుగుతుంది. ఈ సారి మాత్రం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ పాలకొల్లు పట్టణ స్పెషల్ ఆఫీసర్ కావడంతో ఎన్నికల ప్రక్రియ అంతా మున్సిపల్ కార్యాలయంలోనే ఏర్పాటు చేశారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈనెల 18నుంచి ప్రారంభం కానుందని ఆచంట నియోజకవర్గ ఎన్నికల అధికారి స్వామి నాయుడు తెలిపారు. ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి నామినేషన్లు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. 25 వరకు నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు అవకాశం ఉందన్నారు. 26న నామినేషన్ల పరిశీలన జరుగుతుందన్నారు.

నేడు ఛాంబర్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో గురువారం క్యాంప్స్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. దివిస్ లాబొరేటరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఇంటర్వ్యూలో పాల్గొనే విద్యార్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డ్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాల కొరకు ప్లేస్మెంట్ ఆఫీసర్ కె. లక్ష్మణరావు సెల్ నెం 9701394660లో సంప్రదించాలన్నారు.

నేడు పెనుమదంలో ఆత్మీయ సమావేశం

పోడూరు: పెనుమదం గ్రామంలో గురువారం సాయంత్రం వైఎస్సార్ సీపీ పీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ పితాని చిన్న, గ్రామకమిటీ అధ్యక్షుడు గెద్దాడ ఏసు తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి, మండలంలోని ముఖ్యనాయకులు, గ్రామంలోని కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం తూర్పుపాలెంలో నిర్వహించిన మైనార్టీల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ నేడు ముస్లింలకు సీఎం జగన్ ఎంతో ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ అధిక సీట్లు కేటాయించి వారికి సమ ప్రాధాన్యత కల్పించారన్నారు. చంద్రబాబు మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందన్నారు. చంద్రబాబు మోసపూరిత మాటలకు మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగనాథరాజు తనయుడు నరేష్‌రాజు, పెనుగొండ ఎంపీపీ పూతీనిడి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, పిల్లి నాగన్న, జక్కంశెట్టి చంటి, పలివెల శ్రీను, వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీను, డైరక్టరు బొక్కా అరుణ, పార్టీ నాయకులు కేశరపల్లి రమేష్, కలగట సాగర్, పులిదిండి వెంకటేశ్వరరావు, చిన్నం రామిరెడ్డి, వేంద్ర వెంకటేశ్వర్లు, అయ్యప్ప రెడ్డి, బ్రహ్మరెడ్డి, నాగరాజు, సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రో కెమికల్స్ పరికరం ఆవిష్కరణ

భీమవరం: ఆక్వారంగంలో మొబైల్ అప్లికేషన్, ఎలక్ట్రానిక్ అండ్ ఎలక్ట్రోకెమికల్స్ పరికరం విప్లవాత్మక మార్పులకు దోహదం చేస్తుందని యూనోఫీడ్స్ అధినేత తటవర్తి నవీన్ అన్నారు. భీమవరంలో ఆక్వా రైతులకు ఉపయోగపడే ఎలక్ట్రో కెమికల్స్ పరికరం ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆక్వా రైతుల కోసం సలాది గోపీకృష్ణ, పప్పు శ్రీరామ్ కృషితో కౌంట్ 366 సంస్థను స్థాపించి రైతులకు ఉపయుక్తమైన అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్ డివైస్‌లను రైతులకు అందించడం అభినందనీయమని అన్నారు.

నేడు పెనుమంత్ర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెనుమంత్ర: ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు పెనుమంత్ర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో పి పద్మజ తెలిపారు. ఎన్నికల నియమావళిని అనుసరించి ఎటువంటి ప్రతిపాదనలు ఉండవని, వివిధ శాఖల అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని ఈసమావేశాలకు స్థానిక ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

తాగునీటి చెరువులు నింపేందుకు కృషి



కొత్తపాలెంలో తాగునీటి చెరువును నింపేందుకు ఇంజన్ల ద్వారా నీటిని తోడుతున్న దృశ్యం

మొగల్తూరు: ప్రధాన కాలువల నుంచి నీటి సరఫరా ఆగిపోయేలోపు శివారు ప్రాంతాలకు సాగు నీరందించడంతో పాటు గ్రామాల్లోని తాగునీటి చెరువులను నింపేందుకు స్థానిక పాలక వర్గాలు, అధికారులు, కృషి చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో ఇంజన్లు ఏర్పాటు చేసి శివారు ప్రాంతాలకు సాగు నీరు అందిస్తున్నారు. జిన్నూరు కాలువ శివారు గ్రామమైన కొత్తపాలెంలోని మంచి నీటి చెరువులో నీటి మట్టం తగ్గింది. దీంతో చెరువును నింపేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. బుధవారం కొత్తపాలెంలో తాగునీటి చెరువుకు నీరందించే జిన్నూరు కాలువలో నాలుగు ఇంజన్లు ఏర్పాటు చేసి నీటిని తోడుతున్నారు. సర్పంచ్ లోకం నాగలక్ష్మి (నాని) ఆధ్వర్యంలో జిన్నూరు కాలువలో ఇంజన్లు ఏర్పాటు చేసి చెరువును పూర్తిస్థాయిలో నింపేందుకు సిబ్బంది చర్యలు తీసుకున్నారు. రాబోయే రోజుల్లో గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో పంచాయతీ సిబ్బంది ఇంజన్లు ఏర్పాటు చేసి నీటిని తోడుతున్నారు.